www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
శనివారం
07 జూన్ 2025

విలేఖరులు కావలెను


కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రజకీయాలు, సామాజిక అంశలపై అవగాహన ఉండి.. రియగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.
సెల్ : 9494 009 003



# మూసీ ప్రక్షాళన తథ్యం

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- బీఆర్ఎస్ కాదు.. డీఆర్ఎస్
- తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం



**కలంజ్యోతి, భువనగిరి :** ఆరు నూరైనా మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో రూ.1500 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆలేరు నియోజకవర్గంలోని తిరుమలాపురంలో గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. యాదాద్రిని తిరిగి యాదగిరిగుట్టగా మార్చామన్నారు. కొండపై భక్తులు నిద్రించేలా.. ఆటోలు నడిచేలా చేస్తామని తెలిపారు. 60 కిలోల బంగారంతో ఆలయ గోపురం నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని వెల్లడించారు. టీటీడీ బోర్డు మాదిరిగా తెలంగాణలోనూ వైటీడీ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. యాదగిరిగుట్టలోని విద్యాసంస్థలను వర్సిటీ స్థాయికి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఎవరు అడ్డం పడినా సరే.. మూసీ ప్రక్షాళన చేసి నల్గొండ రైతులను ఆదుకుంటామని తెలిపారు. గోదావరి జలాలతో మూసీ నదిని నింపుతాం. సబర్మతి, గంగా నదులు ప్రక్షాళన చేసుకోవచ్చు.. మూసీ నదిని మాత్రం ప్రక్షాళన చేయకూడదా? అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

**బీఆర్ఎస్ కాదు.. అది డీఆర్ఎస్..**

బీఆర్ఎస్ కాదు.. అది డీఆర్ఎస్ (దెయ్యాల రాజ్యసమితి) అని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. బంగారు తెలంగాణ ముసుగులో పదేళ్లు దోచుకున్న వాళ్లా నన్ను ప్రశ్నించేది. వాసాలమర్రి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతామని ఇళ్లన్నీ కూలగొట్టింది ఎవరు అని ప్రశ్నించారు. ఆ తర్వాత కేసీఆర్ ఆ గ్రామాన్ని పట్టించుకోలేదన్నారు. పదేళ్లు దోచుకొని రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చారని విమర్శించారు. రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీశారన్నారు. విద్యార్థులు, రైతులు, ఉద్యమకారులను పొట్టనపెట్టుకున్నారని ఆరోపించారు. పేదలను తప్పుదోవ పట్టించి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. రూ.20 లక్షల కోట్లు ఉంటే రూ.2వేల కోట్లతో ఎస్ఎల్‌బీసీ పూర్తి చేయలేయలేకపోయారన్నారు. పదేళ్లలో ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదని తెలిపారు. యాదగిరిగుట్ట వద్ద అపచారానికి మూల్యం చెల్లించుకున్నారు. పాపాలు చేసినందునే మీ పరిస్థితి ఆ విధంగా మారిందన్నారు. తమ పార్టీలో దెయ్యాలు చేరాయని ఆ పార్టీ నాయకురాలే చెప్పారు. జవాబివ్వలేక దెయ్యాల నేత ఫాంహౌస్‌లో నిద్రపోతున్నారని ఎద్దేవా చేశారు. సభలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, దామోదర రాజ నర్సింహ, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

కలంజ్యోతి
శనివారం 07.06.2025 General News



## మహిళ కడుపు నుంచి 6 కిలోల కణితి తొలగింపు..

**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ జిల్లా భైంసా ఏరియా ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో మహిళ కడుపునుంచి 6 కిలోగ్రాముల భారీ కణితిని శస్త్ర చికిత్స ద్వారా తొలగించారు. వివరాలిలా ఉన్నాయి. ముధోల్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన చిన్నమ్మ (58) అనే మహిళ తీవ్రమైన కడుపు నొప్పి కారణంగా ఆసుపత్రిలో చేరింది. ఆమెకు టెస్టులు చేసిన డాక్టర్లు రిపోర్టులు చూసి షాకయ్యారు. సదరు మహిళ కడుపు లో భారీ కణితిని గుర్తించారు.డాక్టర్లు అపూర్వ రజనీకాంత్, ప్రీతి నేతృత్వంలో ప్రత్యేక డాక్టర్ల బృందం ఆ మహిళకు శస్త్ర చికిత్స నిర్వహించింది. సుమారు రెండున్నర గంటలపాటు కొనసాగిన ఈ ఆపరేషన్ ద్వారా 6 కిలోల పెద్ద కణితిని తొలగించి మహిళ ప్రాణం నిలబెట్టారు.



## చెరువు అలుగు పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

**కలంజ్యోతి, నర్సాపూర్ :** హత్నూర మండలం చింతల్ చెరువు గ్రామ శివారులోని పెద్ద చెరువు అలుగు కాల్వను పూడ్చిన వ్యక్తులపై చర్య తీసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులకు రైతులు ఫిర్యాదు చేసినట్లు శుక్రవారం తెలిపారు. పెద్ద చెరువు నీరు నుండి కట్టుగాల ద్వారా పొలాల్లోకి వెళ్లే అలుగు నీరు వెళ్లే కట్టు కాలువ పూడ్చివేయడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. కట్టు కాలువ పూడ్చిన వ్యక్తులపై చర్యలు తీసుకోవడంతో పాటు కాలువ నుంచి యథావిధిగా మట్టిని తొలగించాలని రైతులు అధికారులను కోరారు.




## దౌల్తాబాద్ లో బడిబాట

**కలంజ్యోతి, నర్సాపూర్ :** దౌల్తాబాద్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ పిల్లలను సరియైన సమయంలో విద్యా బోధనకు పంపించే విధంగా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. బడీడు పిల్లలను పనికి కాకుండా బడికి పంపాలని కోరారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ గ్రామపంచాయతీ ఈవో మజార్ అలీ, మాజీ సర్పంచ్ వెంకటేశం, మాజీ ఎంపీటీసీ ఇందిరా సతీష్, కోపరేటె సొసైటీ డైరెక్టర్ దుర్గంగౌడ్, పంచాయతీ వార్డు మాజీ సభ్యులు అజీజ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ అకీమ్, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అరిగే సాయికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అధిక ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు

### కలెక్టర్ అభిలాష




**కలంజ్యోతి, నిర్మల్ :** జిల్లాలోని ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 నిబంధనలను ఖచ్చితంగా పాటించాల్సిందేనని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ చట్టం - 2010, మహిళ శిశు రక్షణ చట్టాల అమలు, పర్యవేక్షణ అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. మహిళా శిశు రక్షణ చట్టాల అమలులో నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. ఆసుపత్రులు రోగుల నుండి అధిక చార్జీలు వసూలు చేయకూడదని, ప్రతి ఆసుపత్రిలో రేటు ఛా ర్ట్‌ను రిసెప్షన్ ఎదుట స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. రోగులతో మర్యాదగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి ఆసుపత్రిలో కనీస ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, బయో మెడికల్ వేస్ట్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ వైద్య సంస్థలు, స్కానింగ్ సెంటర్లు, డయాగ్నొస్టిక్ ల్యాబ్‌లు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ చట్టం కింద నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధంగా పనిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లింగ నిర్ధారణకు పాల్పడే వారిపై నిఘా పెట్టాలని సూచించారు. సంబంధిత చర్యలకు పాల్పడే వారిపై ఫిర్యాదు చేసేందుకు ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్ 7337448722 ను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని, తగిన ఫీల్డ్ తనిఖీలను నిర్వహించాల్సిందిగా వైద్యాధికారులకు సూచించారు. మానవతా విలువలు మరవకుండా వైద్య సేవలు అందించాలని సూచించారు. రోగులకు సంబంధించిన అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో సమయానికి అప్‌డేట్ చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు.అనంతరం పిసి అండ్ పిఎన్ డిటి చట్టం, అమ్మ రక్ష పోస్టర్లను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.రాజేందర్, వైద్యులు గోపాల్ సింగ్, సురేష్, సరోజ, సునీల్, ప్రైవేట్ వైద్య సంస్థల ప్రతినిధులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, ల్యాబ్‌ల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# నరేంద్రుడి ప్రభుత్వం 11 ఏండ్ల పాలనా విజయవంతం




**కలంజ్యోతి, మల్యాల :** పదకొండేళ్ల మోదీ ప్రభుత్వం.. సంకల్ప సాకారం పేరిట చేపట్టాల్సిన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం వాసుదేవారెడ్డి మాట్లాడుతూ.. 2014, 2019, 2024లో వరుసగా మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం గత 11 ఏళ్లలో ఎన్నో అద్భుత పథకాలు అలు చేసి చారిత్రక విజయాలతో ముందు కొనసాగుతుందన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా ఆదేశాల మేరకు '11 సంవత్సరాల మోడీ ప్రభుత్వం సంకల్పంతో సాకారం' పేరిట చేపట్టే వివిధ కార్యక్రమాల కోసం శుక్రవారం మల్యాల మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ... ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమర్థవంతమైన, నిర్ణయాత్మక నాయకత్వంలో వికసిత్ భారత్ లక్ష్య సహకారం దిశగా ఆత్మవిశ్వాసంతో ఎన్నో చారిత్రక విజయాలతో మోడీ ప్రభుత్వం 11 సంవత్సరాలు విజయవంత పాలన పూర్తి చేసుకుంటున్న శుభ సందర్భంలో ఉన్నామని తెలిపారు. ఈ నెల 5 నుంచి 15వ తేదీ వరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. తల్లి పేరుతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. అలాగే 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం, 23న డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్, 25న ఎమర్జెన్సీ డే లాంటి ముఖ్య కార్యక్రమాలను ఉన్నాయని, పార్టీ సూచన పత్రంలో ఉన్న అన్ని కార్యక్రమాలను పూర్తిస్థాయిలో చేపట్టాలని సూచించారు. 11 ఏళ్ల మోదీ ప్రభుత్వ విజయవంత పాలన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ , ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆపరేషన్ సింధూర్ ను విజయవంతంగా చేపట్టిన భారత త్రివిద దళాలకు, ప్రధాని మోదీకి అభినందనలు, కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశంలో తీర్మానం చేశారు. సమావేశంలో బొబ్బిలి వెంకటస్వామియాదవ్, మాజీ ఎంపీటీసీలు సంఘని రవి, కొల్లూరు గంగాధర్, కొణిదెల రాజన్న, నేరెళ్ల శ్రావణ్ కుమార్, బొట్ల ప్రసాద్, కెల్లేటి రమేష్, ముదిగంటి రాజు, బొడిగ సురేష్, పిల్లి రాజశేఖర్, కటకం లత, అవుదుర్తి రమా, పొన్నం సాయికుమార్, సామ మైపాల్ రెడ్డి, కొను శ్రీనివాస్, జవ్వాజి రాజ్ కుమార్, నీలం రవి, నక్కా ఆనందం, భూసారపు మౌనిక్, కందుల వినోద్, గడ్డం నడిపి మల్లేశం, బూత్ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలంజ్యోతి 3
శనివారం 07.06.2025 General News

# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

## ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



**కలంజ్యోతి, మల్యాల :** ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద కుటుంబాల పిల్లలకు మెరుగైన విద్య బోధన ఉచితంగా అందుతుందని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చి వారి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆయన సూచించారు. నిర్మల్ జిల్లా తానూరు మండలం బొంద్రడ్ లో జరిగిన జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లలందరిని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, మధ్యాహ్న భోజన సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. ఇవన్నీ ప్రజలకు తెలియచెప్పి అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా విద్యా బోధన జరుగుతుందని ప్రజల్లో అవగాహన కల్పించాలని వివరించారు. గ్రామ సమస్యలు దశల వారీగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

# రుద్రంగి ఎస్సైగా మోతిరామ్



**కలంజ్యోతి, రుద్రంగి :** శాంతి భద్రతలో పరిరక్షణలో మండలం లోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రుద్రంగి ఎస్సైగా నూతన బాధ్యతలు చేపట్టిన మోతిరామ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే ఆదేశానుసారం రుద్రంగి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఎస్సైగా బాధ్యతలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. మోతీరామ్ గతంలో వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ లో పనిచేశారు. ఇక్కడ విధులు నిర్వహించిన సిరిసిల్ల అశోక్ ఇల్లంతకుంట ఎస్సై గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై మోతిరామ్ మాట్లాడుతూ... రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండల ప్రజలు సహకరించాలని ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరుసహకరించాలని తెలిపారు.

# 420 పేజీల జిరాక్స్ ప్రతులకు రూ.5,850

- ఆర్టీఐ ప్రతులకు దరఖాస్తుదారుడి చెల్లింపు
- గ్రామపంచాయతీ అధికారులకు అందజేసిన డీడీ




**కలంజ్యోతి, మల్యాల :** స.హ.చట్టం ద్వారా 420 పేజీల జిరాక్స్ ప్రతుల కోసం దరఖాస్తుదారుడి నుంచి రూ.5,850 వసూలు చేశారు. మల్యాల మండలంలోని గుడిపేట గ్రామానికి చెందిన ఎనుగంటి వెంకటరమణ హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. గుడిపేట గ్రామపంచాయతీ పరిధిలో 2018 నుంచి 2024 వరకు జరిగిన అభివృద్ధి పనులు, అందుకు సంబంధించిన తీర్మాన ప్రతులు, బిల్లుల చెల్లింపు తదితర వివరాలు సమర్పించాలని స.హ.చట్టం ద్వారా వినతిపత్రం అందజేశారు. సమాచారం అందించేందుకు 744 జిరాక్స్ ప్రతుల కోసం రూ.5,150, పోస్టల్ ఛార్జీల కింద మరో రూ.700 చెల్లించాలని గ్రామపంచాయతీ అధికారులు తెలిపారు. వెంకటరమణ రూ.5,850 డీడీని గ్రామపంచాయతీకి పంపించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి 420 పేజీల జిరాక్స్ ప్రతులను వెంకటరమణకు అందజేశారు. స.హ. చట్టం నిబంధనల ప్రకారం ఏ4, ఏ3 సైజు ఒక్కో జిరాక్స్ కాగితానికి రూ.2 మాత్రమే వసూలు చేయాలని, ఆ లెక్కన రూ.840 మాత్రమే అవుతుందని, దానికి విరుద్ధంగా రూ.5,850 వసూలు చేయడం సరికాదని, అధిక మొత్తంలో వసూలు చేసిన డబ్బులు తిరిగి చెల్లించాలని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని మే 26న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స.హ.చట్టం దరఖాస్తుదారుడి నుంచి అధికంగా వసూలు చేసిన డబ్బులను తిరిగి చెల్లించాలని జిల్లా ఉన్నతాధికారులు మండలస్థాయి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఈ విషయమై ఎంపీవో ప్రవీణ్‌ను వివరణ కోరగా జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి విచారణ చేపట్టి మిగిలిన డబ్బులు దరఖాస్తుదారుడికి చెల్లిస్తామని తెలిపారు.



## వరదల నియంత్రణకు

# చర్యలు తీసుకోవాలి

## కలెక్టర్ అభిలాష అభినవ్

**కలంజ్యోతి, నిర్మల్ :** వర్షాకాలంలో సంభవించే వరదల్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు సంబంధిత శాఖల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. నిర్మల్ జిల్లా ఫ్లడ్ మ్యానువల్-2025 పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరంలో జిల్లాలో నమోదైన వరదల వివరాలు, వాటి తీవ్రత, వాటివల్ల జరిగిన ఆస్తి, పంట నష్టం తదితర సమాచారాన్ని ఈ పుస్తకంలో సమగ్రంగా పొందుపరిచినట్లు తెలిపారు. నివాస గృహాలు, రహదారులు, వంతెనలు, వ్యవసాయ పంటలకు జరిగిన నష్టం అంచనాలు, విలువలు వివరంగా పొందుపరచినట్లు చెప్పారు. ప్రస్తుత వర్షాకాలంలో తక్షణం తీసుకోవలసిన చర్యలు, సహాయక చర్యలు, పునరావాస ఏర్పాట్లు వంటి అంశాలు ఈ మ్యానువల్‌లో పొందుపరిచినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంలో జాప్యం జరగకూడదని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ కుమార్, ముఖ్య ప్రణాళికాధికారి జీవరత్నం, తదితరులు పాల్గొన్నారు.



# భూ భారతి వినియోగించాలి


## అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత

**కలంజ్యోతి, మల్యాల :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి సదస్సులను వినియోగించుకుని, రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) బీఎస్ లత సూచించారు. మండలంలోని మానాల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొన్నారు. భూ సమస్యలను అధికారులకు వివరించి, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసిల్దార్ వసంత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రారంభమైన బడిబాట

**కలంజ్యోతి, మల్యాల :** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం శుక్రవారం మల్యాల మండలంలో ప్రారంభించారు. ఈ మేరకు అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. తక్కలపల్లి, మ్యాడంపల్లి గ్రామాల్లో పాల్గొన్న ఎంఈఓ జయసింహారావు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కష్టపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్స్, మహిళా సంఘాల ప్రతినిధులు,ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## వధువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**కలంజ్యోతి, చెన్నారావుపేట** : మండలంలోని జోజిపేట గ్రామానికి చెందిన విజయ సదాశివ దంపతుల కుమారుడు సురేష్ కమల దంపతుల వివాహ రిసెప్షన్ వేడుకల్లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొని వధూవరులు ఆశీర్వించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు రంజిత్ రెడ్డి, రామనంద్, మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, మండల ఉపాధ్యక్షుడు నన్నెబోయిన రమేష్ యాదవ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సంపత్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రూపిక శ్రవణ్ కుమార్, ఆయా గ్రామాల అధ్యక్షులు తిరుపతి రెడ్డి, పులిశెరు రాజేందర్, మాజీ సర్పంచ్ తూటి పావని రమేష్, మాజీ ఉప సర్పంచ్ బాణోత్ వీరన్న, భూక్య సురేష్, భరత్, షేక్ కయాజ్, దినాకర్, పడిదం రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



## యువతి వివాహానికి బీటీఆర్ఎఫ్ చేయూత

**కలంజ్యోతి, ఇల్లంతకుంట** : మండలంలోని సోమారంపేట గ్రామానికి చెందిన తడకపెల్లి రాజయ్య భాగ్య కుమారై మేఘన రవివర్మ వివాహనికి బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డి టేక్ మంచాలు, రూ.10వేలువైన వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లంతకుంట మండలంలోని పేద కుటుంబలా కుమార్తెల వివాహలకి తాను ఎల్లపుడు సహాయాలు అందిస్తూనే ఉంటానన్నారు. ఈ సేవా కార్యక్రమానికి గ్రామాల్లోని యువకులు, సేవా ప్రతినిధులు సమాచారమందించాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సేవా ప్రతినిధులు గైని శ్రీనివాస్, మేఖ శ్రీనివాస్, ముడపెల్లి మధు, కొమ్ము రాజు, మంతకోరు కనూకయ్య, తడకపెల్లి అరుణ్, తడకపెల్లి పోచయ్య, తడకపెల్లి అనిల్, తడకపెల్లి తిరుపతి, రాజ్, తడకపెల్లి అశోక్, తడకపెల్లి మల్లయ్య, తడకపెల్లి లింగం, గును, అలుసా రాజు తదితరులు పాల్గొన్నారు.



## సొంతింటి కల 'ఇందిరమ్మ ఇండ్ల'తో సకారం

**కలంజ్యోతి, ఇల్లంతకుంట** : మండలంలోని నిరుపేదలకు సొంతింటి కళ 'ఇందిరమ్మ ఇండ్ల'తో సకారం అవుతుందని కాంగ్రెస్ పార్టీ ఇల్లంతకుంట మండల శాఖ అధ్యక్షులు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పత్తికుంట పల్లే గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇంటి నిర్మాణం కోసం భూమి పూజ చేసి, ఎంపీడీఓ వై శశికళ, మాజీ ఎంపీపీ గుడిసే అయిలయ్యతో కలిసి ముగ్గు పోశారు. లబ్దిదారులు ఎల్కపెల్లి రేణుక, బోయిని పద్మ, బట్టు రేణుక, జుట్టు రాజమణికి చెందిన ఇళ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో హౌజీంగ్ ఏఈ శ్రీజ, కార్యదర్శి సాయిసుధ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బోడ తిరుపతి రెడ్డి, జుట్టు నగేష్, ఎగుర్ల కనుకయ్య, అలువాల పద్మయ్య, బోడ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# సమగ్ర వ్యవసాయంతో అధిక లాభాలు

### కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**కలంజ్యోతి, చెన్నారావుపేట** : సమగ్ర వ్యవసాయ విధానం ద్వారా అధిక లాభాలు పొందవచ్చునని కలెక్టర్ డాక్టర్ సత్యశారద తెలిపారు. శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం మామునూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వికసిత్ కృషి - సంకల్ప్ అభియాన్ యాత్ర' కార్యక్రమాన్ని చెన్నారావుపేట మండలం అమీన్‌బాద్ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. వరంగల్ జిల్లాలోని నర్సంపేట డివిజన్ రైతులు ఒక నెల వరి పంటను ఆలస్యంగా వేస్తున్నారని, ముందుగా వేయాలని సూచించారు. ముఖ్యంగా నీటి వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వరిని తొందరగా విత్తడం వలన అధిక దిగుబడి సాధించవచ్చని, తెగుళ్లు, చీడ పీడల ప్రభావం తగ్గించవచ్చని అలాగే ముందుగా వరి కోయవచ్చని వివరించారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు వాడాలని అలాగే రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలన్న సూచనలు చేశారు. రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ,చేపల పెంపకం వంటి అనుబంధ రంగాలను కూడా చేయాలని, సమగ్ర వ్యవసాయ విధానం ను అనుసరించాల్సిన అవసరాన్ని జిల్లా కలెక్టర్ వివరించారు. రైతుల ఆదాయాన్ని పెంచడమే కాక, వ్యవసాయాన్ని స్థిరీకరిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వికాషిత్ కృషి-సంకల్ప్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రాజన్న, ప్రోగ్రాం కోఆర్డినేటర్, కేవీకే, డాక్టర్ తమ్మీ రాజు, జిల్లా వ్యవసాయ అధికారిని అనురాధ, పశుసంవర్ధక శాఖజాయింట్ డైరెక్టర్ బాలకృష్ణ, దామోదర్ రెడ్డి, ఏడీఏ, నర్సంపేట, శాస్త్రవేత్తలు డాక్టర్ రాజు, శతీష్ చంద్ర, మండల రెవెన్యూ అధికారి ఫణికుమార్, మండల వ్యవసాయ అధికారి గోపాల్ రెడ్డి, చెన్నారావుపేట తహసీల్దార్ ఫణి కుమార్, నాయబ్ తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



## మానాల సౌదీ సంఘం కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక

**కలంజ్యోతి, రుద్రంగి** :రాజన్న సిరిసిల్ల జిల్లా, రుద్రంగి మండలం మానాల సౌదీ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సౌదీ సంఘం సభ్యుల ఆధ్వర్యంతో పాటు మాజీ అధ్యక్షుడు అల్లూరి సంతోష్, మాజీ ఉప అధ్యక్షుడు బెల్లాల తిరుపతి, సంఘ సభ్యుల సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా అల్లూరి శివకుమార్, ఉపా అధ్యక్షులుగా యాసోజీ శేఖర్ ను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ఉపా అధ్యక్షులు మాట్లాడుతూ.. మానాల సౌదీ సంఘ అభివృద్ధికి, గ్రామ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని, అందరూ సహకరించాలని కోరారు. తమకు బాధ్యతలు ఇచ్చేందుకు కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మానాల సౌదీ సంఘం సభ్యులు అందరూ పాల్గొన్నారు.



## మా కామాఖ్యలో నార్మల్ డెలివరీకి రూ. 5 వేలు మాత్రమే

**కలంజ్యోతి, మల్యాల** : జగిత్యాల జిల్లా కేంద్రంలోని మా కామాఖ్య ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ డాక్టర్ చైతన్య సుధ ఎక్కువగా నార్మల్ డెలివరీలపై దృష్టి సారించారు. అయితే మా కామాఖ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేనేజింగ్ డైరెక్టర్ నరహరి నార్మల్ డెలివరీలకు కేవలం రూ. 5 వేలు మాత్రమే ఫీజు తీసుకుంటామని ప్రకటించారు. దీంతో నార్మల్ డెలివరీ అయిన పేషెంట్స్ సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మేనేజ్మెంట్ అభినందించారు.



# పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇండ్లు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నిర్ణయం
- పేదలు ఉన్న చోటే జీ+3 పద్ధతిలో ఇండ్ల నిర్మాణం
- గిరిజనులకు ప్రత్యేకంగా 22 వేల ఇండ్లు



**కలంజ్యోతి, హైదరాబాద్ :**గ్రామాల్లో మాదిరిగానే ఇకపై పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేపట్టి.. అర్హులకు అందజేస్తామని రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ గ్రామీణ ప్రాంల్లో ఒక కొలిక్కి తీసుకువచ్చిన నేపథ్యంలో పట్టణ ప్రాంతాలలో కూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై దృష్టి సారించినట్లు వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణాల్లోని మురికి వాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడుతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ కు దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇండ్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. హైదరాబాద్ కు దూరంగా గతంలో 42 వేల ఇండ్లను నిర్మిస్తే.. సుమారు 19 వేల మంది మాత్రమే అక్కడికి వెళ్లారన్నారు. ఇటీవల క్షేత్రస్థాయిలో మరోసారి సర్వే నిర్వహిస్తే కేవలం 13 వేల మంది మాత్రమే ఆ నివాసాల్లో ఉంటున్నట్లు తేలిందన్నారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని పట్టణ ప్రాంతాలలో ప్రధానంగా హైదరాబాద్ నగరంలోని మురికి వాడల్లో పేదలు ఉన్నచోటే జీ+3 పద్ధతిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా తొలివిడతలో హైదరాబాద్‌లో 16 మురికివాడలను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. అలాగే వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, కరీంనగర్ తదితర పట్టణాలలో కూడా ఇదే విధానాన్ని అమలు చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఏండ్ల తరబడి నిలువ నీడలేక, తలదాచుకోవడానికి గూడు లేని చెంచులకు భద్రాచలం, ఉట్నూరు, ఏటూరునాగారం, మున్ననూరు నాలుగు ఐటిడిఎ పరిధిలోగల చెంచు, కొలం, తోటి, కొండరెడ్లకు 13,266 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని మంత్రి తెలిపారు.రాష్ట్రంలోని 16ఎస్టీ నియోజకవర్గాలకు ఇప్పటికే 8,750 ఇండ్లు మంజూరు చేశామన్నారు. దీనితో కలిపి గిరిజనులకు ఇంతవరకు 22,016 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు వివరించారు. ఈ ఇండ్లకు తక్షణమే లబ్దిదారులను గుర్తించి ఇండ్ల నిర్మాణ ప్రక్రియను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# ఎమ్మెల్యేల పనితీరు బాలేదు

## టీపీసీసీ చీఫ్ ఆగ్రహం




**కలంజ్యోతి, హైదరాబాద్ :** ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదని, నియోజకవర్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ పనితీరును సమీక్షించుకొని సరిదిద్దుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఎక్కువ సమయం గడిపి, ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈనెలలోనే టీపీసీసీ కార్యవర్గ విస్తరణ, మంత్రివర్గ విస్తరణ పూర్తయ్యే అవకాశం ఉందని.. దీనికి సంబంధించి చర్చలు ఢిల్లీలో ఏఐసీసీ అధిష్ఠానంతో జరిగాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమ లు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు అందుతున్నాయని, తెలంగాణలో జరిగిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. అయితే, పార్టీ బలోపేతం కోసం ఎమ్మెల్యేలు, మంత్రులు సమన్వయంతో పనిచేయాలని, బూత్ స్థాయి నుంచి పార్టీని బలపరచాలని ఆయన ఉద్ఘాటిం చారు. కాంగ్రెస్‌లో పాత నాయకులు, బీఆర్ఎస్ నుంచి వచ్చిన కొత్త ఎమ్మెల్యేల మధ్య సమన్వ యం కోసం ప్రయత్నిస్తున్నామని, కొన్ని నియోజకవర్గాల్లో సమస్యలున్నా వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. తెలంగాణ మంత్రివర్గంలో 18 మంది సభ్యులకు అవకాశం ఉండగా, ప్రస్తుతం 12 మంది మాత్రమే ఉన్నారు, మిగిలిన ఆరు ఖాళీలను భర్తీ చేయడానికి ఏఐసీసీతో చర్చలు జరుగుతున్నాయని, ఈ విస్తరణలో కుల, ప్రాంతీ య సమతుల్యతను పాటిస్తామని మహేష్ గౌడ్ తెలిపారు. టీపీసీసీ కార్యవర్గ విస్తరణలో బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేసే ప్రక్రియ ఈ నెలలో పూర్తయ్యే అవ కాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ లో ఐక్యతను కాపాడటం, స్థానిక ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయడం, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావడమే తన లక్ష్యమని మహేష్ గౌడ్ పేర్కొన్నారు.




## అంగడీ సెంటర్ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు

**కలంజ్యోతి, మల్యాల :**మండల కేంద్రంలో చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ఇటీవల మంజూరు చేసిన హైమాస్ట్ లైట్లను శుక్రవారం మల్యాల కేంద్రంలో అంగడి బజార్ లోని వారసంతలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇన్ని రోజులు సరిగ్గా వెలుతురు లేక అంగడి మార్కెట్లో ప్రజలు చాలా ఇబ్బందికి గురయ్యారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లగా లైట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శనిగారపు తిరుపతి మండల కాంగ్రెస్ నాయకులు కోరేపు వెంకటేష్, మ్యాక సాయి, దూడం రామాంజనేయులు, దూస వెంకన్న, మురళి, ఆగంతపు వంశీధర్, శ్రీకోటి శ్రీకాంత్, ఇమామ్, జాఫర్, హరీష్ , చైతన్య, మహేష్,మనోజ్, సుమన్ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులను అభినందించిన కలెక్టర్

**కలంజ్యోతి, చెన్నారావుపేట:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి వరంగల్ రీజియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో జిల్లా ద్వితీయ బహుమతి, చిత్రలేఖనంలో ప్రత్యేక బహుమతి పొందిన ఉప్పరపల్లి విద్యార్థులు కల్లెపు హరిప్రియ, చిలపాక ద్రాక్షాయని కలెక్టర్ సత్య శారద అభినం దించారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ చేతులమీదుగా ప్రశంస పత్రం, మెమెంటో పొందారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, జిల్లా అటవీ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నిట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు. కాగా, విద్యార్థులను ఉప్పరపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం తేజావత్ జయ, గైడ్ టీచర్లు గజవెల్లి సుందర్, కె. సంతోష్ కుమార్, రాగి శశిధర్, పిన్నింటి బాలాజీ రావు అభినందించారు.



## హైదరాబాద్‌లో భారీ వర్షం

**కలంజ్యోతి, హైదరాబాద్ :**రాష్ట్ర రాజధాని నగరంలో శుక్రవారం పలు చోట్ల భారీ వర్షం కురిసింది. ఖైరతాబాద్, పంజాగుట్ట, అమీర్ పేట్, బేగంపేట్, బాలానగర్, సనత్ నగర్, కోటి, నాంపల్లి, చార్మినార్, మలక్ పేట్, మెహెదీపట్నం, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. వర్షపు నీరు రోడ్లపై చేరడంతో పలుచోట్ల ట్రాఫిక్ జాం ఏర్పడింది. కాగా మరో రెండు గంటలపాటు ఈ వర్షం కొనసాగనుందని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. మరోవైపు నేడు తూర్పు, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నెలకొన్నాయి. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో 41 డిగ్రీలకు పైగా టెంపరేచర్ నమోదైంది.

Cinema
కలంజ్యోతి
శనివారం 07.06.2025



# ఎప్పటికీ రుణపడి ఉంటా..

యంగ్ బ్యూటీ నభా నటేష్ ప్రస్తుతం వరుస సినిమాల్లో నటిస్తూ ఫుల్ బిజీగా ఉంటుంది. ఇందులో నిఖిల్ 'స్వయంభు' తో పాటు, మరో ప్రతిష్టాత్మక చిత్రం నాగబంధంలో ఆమె నటిస్తుంది. ఈ రెండు చిత్రాలు పాన్ ఇండియా రేంజ్‌లో తెరకెక్కుతుండటంతో.. ఈ మూవీస్‌తో నభా కెరీర్ కూడా ఓ మలుపు తిరుగుతుందని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు ఫ్యాన్స్. ఇక వీటితో పాటు మరో రెండు మూడు సినిమాలు కూడా లైన్‌లో పెట్టంది నభా. ఇదిలా ఉంటే.. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలకు, ప్రకృతికి ఎప్పుడు అందుబాటులో ఉంటుంది. ఈ క్రమంలోనే తాజాగా తన ఇన్‌స్టా వేదికగా ఓ ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టింది ఈ హీరోయిన్. 'ఈ రోజు నేను ఒక చెట్టును కౌగిలించుకున్నాను.. ఆ చెట్టు కూడా నన్ను తిరిగి కౌగిలించుకున్నట్లు అనిపించింది. అలాగే.. నిజంగా ఈ భూవీ నాకు నిశ్శబ్దంగా అనుమతి ఇస్తున్నట్లు అనిపిస్తుంది. ఈ అందమైన ప్రపంచాన్ని ఆస్వాదించడానికి మనం కేవలం అతిథులం. ప్రకృతి మనకు అనేక అద్భుత అనుభవాలను అందిస్తోంది. ఈ పర్యావరణాన్ని, ప్రకృతిని అనుభవించడమే మన హక్కు. ఈ సంతోషాన్ని, అనుభూతిని అందించిన నేచర్‌కు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను'

